# జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్‌లు

# మరియు

# ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల నిర్వహణ

(అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు విధుల, బాధ్యతలు - ఇతర సంబంధిత విషయములు)


సంకలనము

**డి. చెన్నకిషన్**

బి.ఎ., ఎల్.ఎల్.యం., హెచ్.డి.సి.

జాయింట్ రిజి(స్ట్రార్ సహకార సంఘములు ( రిటైర్డ్)



**స్టేట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఫర్**

**లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఆంధ్రప్రదేశ్ (SMILDA)**

**పశుసంవర్ధక శాఖ, హైదరాబాద్ వారి సౌజన్యంతో**

# విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయము | పేజి నెంబర్ |
| --- | --- | --- |
| 1. | సహకార సంఘముల చట్టములు, నిబంధనలు మరియు నిబంధనావళి - ఆచరణ | 1 |
| 2. | రిజిస్టర్ కాబడిన సంఘమునకు చట్టపరంగా ప్రత్యేక ప్రతిపత్తి (సొసైటీ ఒక బాడీ కార్పరేటు) | 2 |
| 3. | సభ్యులకు సేవలందించుట సొసైటీ బాధ్యత | 3 |
| 4. | సొసైటీ ఆస్తులను అన్యాక్రాంతము చేయుటపై ఆంక్షలు | 3 |
| 5. | సొసైటీ సభ్యత్వానికి అర్హతలు | 3 |
| 6. | సొసైటీ సభ్యత్వానికి అనర్హతలు | 4 |
| 7. | సహకార సంఘముల చట్టము 1964, రూలు 18 ప్రకారము సభ్యులు చేయ వలసిన కనీస వ్యాపారము, ఉపయోగించు కొనవలసిన కనీస సేవలు | 5 |
| 8. | సొసైటీ పాలక మండలి సభ్యులకు అనర్హతలు | 6 |
| 9. | కమిటీలో సభ్యత్వం రద్దు కావటం | 8 |
| 10. | కమిటీ సమావేశములకు గైరు హాజరు అయినందువలన పదవిని కోల్పోవుట | 9 |
| 11. | సొసైటీ సభ్యులను బహిష్కరించుట | 9 |
| 12. | ఓటు హక్కు- దాని వినియోగము. | 9 |
| 13. | జనరల్ బాడీ విధులు, బాధ్యతలు | 10 |
| 14. | సొసైటీ పాలక మండలి ఎన్నికలు | 12 |
| 15. | పాలక మండలి అధికారములు, విధులు | 12 |
| 16. | సొసైటీ అధ్యక్ష మరియు పాలక మండలి సభ్యుల రాజీనామా | 15 |
| 17. | పాలక మండలి సమావేశ నోటీసులను జారీ చేయు విధానము | 15 |
| 18. | జనరల్ బాడీ సమావేశములకు, పాలక మండలి సమావేశములు | 16 |
| 19. | జనరల్ బాడీ సమావేశములకు, పాలక మండలి సమావేశములకు కోరం | 16 |
| 20. | పర్సన్ - ఇన్ - చార్జి కమిటీ నియామకము | 16 |
| 21. | అధ్యక్షుని అధికారములు, ఉపాధ్యక్షునికి సంక్రమించు సందర్భములు | 17 |

| క్రమ సంఖ్య | విషయము | పేజి నెంబర్ |
|---|---|---|
| 22. | అధ్యక్షులు, పాలక మండలి, మ్యానేజింగ్ డైరెక్టరు మరియు సిబ్బంది పరస్పర, అవగాహన, సత్సంబంధములు, సమన్వయము | 17 |
| 23. | అధ్యక్షులు, పాలక మండలి సభ్యులు చేయ వలసిన, చేయకూడని పనులు (Do's and Dont's) | 18 |
| 24. | పాలక మండలిని బర్తరఫ్ చేయుట | 20 |
| 25. | సొసైటీ నిర్వహించ వలసిన రిజిస్టర్లు. అకౌంటు పుస్తకములు | 21 |
| 26. | సొసైటీ చిరునామా మరియు సైను బోర్డు | 22 |
| 27. | బైలాలు, వార్షిక జమా ఖర్చులు, లాభనష్టాల పట్టిక మొదలైనవి సభ్యులకు అందుబాటులో ఉండవలెను. | 22 |
| 28. | సొసైటీ సమావేశములకు ఎవరు అధ్యక్షత వహించ వలెను. | 22 |
| 29. | సహకార సంఘముల పారితోషకము (ఆనరోరియం) | 23 |
| 30. | సొసైటీ కార్యలయ ఆవరణను ఇతర కలాపములకు ఉపయోగించ రాదు. | 23 |

# జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్‌లు మరియు ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల నిర్వహణ

(అధ్యక్షులు, పాలకవర్గ సభ్యుల విధులు, బాధ్యతలు - ఇతర సంబంధిత విషయములు)

## 1. సహకార సంఘముల చట్టములు, నిబంధనలు మరియు నిబంధనావళి - ఆచరణ

జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియనులు మరియు ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలు, రిజిస్టరుఅయిన తర్వాత ఆయా సంబంధిత, క్రింద ఉదహరించిన సహకార సంఘముల చట్టముల, నిబంధనల మరియు రిజిస్టరు చేయబడిన నిబంధనావళిలో పొందు పరచబడిన నియమాలను అనుసరించి తుచా తప్పకుండ సంఘ నిర్వహణ చట్టపరంగా చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. అట్టి శాసన నిర్మిత చట్టములను, నిబంధనలను, మరియు నిబంధనావళిని ఆచరణలో పెట్టని సందర్భములలో, సంఘ వ్యవహారములు కుంటు బడుటయేగాక అందుకు బాధ్యులైన వారిని ప్రాథమిక సభ్యత్వము నుండి, పాలక మండలి సభ్యత్వము నుండి అనర్హులుగా ప్రకటించుటయే గాక, వారిని శిక్షార్హులుగా పరిగణింపగల విశేషాధికారము ఫంక్షనల్ రిజిస్ట్రారులకు చట్టం ఆపాదించింది. అందు వలన ఏయే చట్టాలలో, నిబంధనలలో ఏమేమి శాసనబద్ధంగా పొందు పరచ బడినదో తెలుసుకోవడం ఎంతైన అవసరం ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాలు మరియు జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్‌లకు సంబంధించి నంతవరకు, ఈ క్రింది చట్టాలు, నిబంధనలు మరియు నిబంధనావళులు వర్తించును.

1. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల చట్టము (>) **1964.**
2. ఆంధ్రప్రదేశ్ సహకార సంఘముల నిబంధనలు (రూల్సు) **1964.**
3. **1964** చట్టము కింద రిజిస్టరు చేయబడిన నియమావళి (బైలాస్)
4. ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయక సహకార సంఘముల చట్టము **1995 (30 of 1995).**
5. **1995** చట్టము కింద రిజిస్టరు చేయ బడిన నియమావళి (బైలాస్)
6. ఒక వేళ ఏదైన గొర్రెల పెంపకం దార్ల సంఘము పరిధి మరియు వ్యాపార కార్యకలాపములు రాష్ట్రమునకు కాకుండ ఇతర రాష్ట్రములకు కూడా విస్తరించిన సందర్భములో మల్టీస్టేటు కోఆపరేటివ్ సొసైటీస్ ఆక్ట్ **2002** కూడా వర్తించును.
7. ఈ చట్టాలే కాకుండ రాష్ట్ర ప్రభుత్వము గాని లేదా ఫంక్షనల్ రిజిస్ట్రారు గాని ఎప్పటి

కప్పుడు జారీ చేసిన ఆదేశాలను కూడా గొర్రెల పెంపకం దారుల సంఘాలు పాటించ వలసి యుండును.

పైన ఉదహరించిన సహకార సంఘాల చట్టాలే కాకుండ ఇతర సంబంధిత చట్టాలు ( అలైడ్ లాస్) లు కూడ మన సంఘాలకు ఇతర సహకార సంఘాలతో పాటు వర్తిస్తాయి. అవిః

i) భారతీయ శిక్షాస్మృతి చట్టము 1860 (ప్రత్యేకించి దుర్వినియోగము, మోసము చేయుట, క్రిమినల్ బ్రీచ్ ఆఫ్ ట్రస్టు మొదలగునవి).

ii) ఇండియన్ లిమిటేషన్ చట్టము 1963 (కాల దోషము పట్టిన ఋణములు)

iii) ఇండియన్ కాంట్రాక్ట్ చట్టము 1872

iv) ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ చట్టము 1947

v) సేల్ ఆఫ్ గూడ్సు చట్టము 1930, మొదలగునవి.

న్యాయ శాస్త్రంలో, జూరిస్ ప్రూడెన్స్‌లో చెప్పబడిన మౌళిక సూత్రము ప్రకారము న్యాయ చట్టము తెలుసుకోక పోవడం క్షమార్హము కాదు (Ignorance of Law is no excuse). అందువలన చట్టములలో పొందుపరచ బడిన విషయములను తెలుసుకొనడం. తర్వాత తప్పకుండా ఆచరించడం చట్టం మన నుంచి ఆశిస్తుంది.

## ౨. రిజిస్టర్ కాబడిన సంఘమునకు చట్టపరంగా ప్రత్యేక ప్రతిపత్తి (సొసైటీ ఒక బాడీ కార్పరేటు)

ఆం. ప్ర. సహకార సంఘముల చట్టము 1964 సెక్షన్ 9 లో గాని లేదా ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయక సహకార సంఘాల చట్టము సెక్షన్ 6లో పొందు పరచిన నియమము ప్రకారము, ఈ రెండు చట్టములలో ఏదైన సంఘము రిజిస్టరు అయినయెడల రిజిస్టర్ కాబడిన సొసైటి ఒక బాడీ కార్పొరేటుగా పరిగణింప బడుతుంది. రిజిస్టర్ కాబడిన పేరుతో ఆ సొసైటికి ఆమొద ముద్ర లభిస్తుంది. శాశ్వత వారసత్వలక్షణాలు లభిస్తాయి. సొసైటి పేరుతో ఆస్థులను సమకూర్చు కోవచ్చు కలిగి ఉండవచ్చు. విక్రయించవచ్చు, ఇతరులతో ఒప్పందములు కుదుర్చు కోవచ్చు. దావాలను దాఖలు చేసుకోవచ్చు. సొసైటీ పై ఇతరులు దావాలను ధాఖలు చేయవచ్చు. సొసైటీ లక్ష సాధన కోసం అవసరమైన అన్ని చర్యలను తీసుకొనె అధికారం సంక్రమిస్తుంది. బాడీ కార్పొరేట్ అనే పదానికి కృత్రిమ వ్యక్తి అనే అర్థం చెప్పుకోవచ్చు.

## 3. సభ్యులకు సేవలందించుట సొసైటి బాధ్యత

సహకార సంఘముల చట్టము 1964 సెక్షను 22లో పొందు పరిచిన విధంగా ఏ వ్యక్తి ఐనా ఒక సొసైటీలో సభ్యత్వం పొందిన వెంటనే ఆ సొసైటి నుండి సేవలను, సహాయ సహకారాలను పొందే హక్కు సభ్యునికి సంక్రమిస్తుంది. సభ్యుల దరఖాస్తు మేరకు అందుబాటులో ఉన్న సేవలను వారికి అందించటం సొసైటీ కమిటీ యొక్క బాధ్యత.

కొన్ని సందర్భాలలో సభ్యుడు కోరిన విధంగా సేవలందించటానికి కమిటీ తిరస్కరించ వచ్చు లేక సేవల కొరకు సభ్యుడు దరఖాస్తు చేసుకున్న 30 రోజుల లోపల ఆదరఖాస్తు పై కమిటీ తన నిర్ణయాన్ని సదరు సభ్యునికి తెలియ పరచక పోవచ్చు. అటువంటి సందర్భములలో తన అభ్యర్థన తిరస్కరించబడిన (30) రోజుల లోపల గాని లేక తాను దరఖాస్తు చేసుకున్న (60) రోజుల తర్వాత గాని (సొసైటి తన నిర్ణయాన్ని తెలియ పరచని సందర్భములలో) సదరు సభ్యుడు ఆ విషయముపై ఫంక్షనల్ రిజిస్ట్రారుకు ఫిర్యాదు చేసుకోవచ్చు.

అప్పుడు ఫంక్షనల్ రిజిస్ట్రారు ఆవిషయముపై సొసైటి అభిప్రాయములను తెలుసుకొనిన పిదప, సదరు సభ్యునికి సేవలందించటానికి సొసైటి తిరస్కరించటం సమంజసం కాదని భావించినట్లైతే, సభ్యుడు కోరిన విధంగా తగిన సేవలందించవలసిందిగా కమిటీని రిజిస్ట్రారు ఆదేశించ వచ్చును.

## 4. సొసైటీ ఆస్థులను అన్యాక్రాంతము చేయుటపై ఆంక్షలు

సహకార సంఘములు చట్టము 1964 సెక్షన్ 9A లోపొందు పరిచన విధంగా ఒక సొసైటి ప్రభుత్వం ఆర్థిక సహాయం సెక్షను 43లో చెప్పబడిన విధంగా పొంది ఉండవచ్చును. అటువంటి సొసైటి ఫంక్షనల్ రిజిస్ట్రార్‌లేదా సందర్భాను సారంగా ఫెడరల్‌సొసైటి లేక ఫైనాన్సింగ్ బ్యాంకు అనుమతి లేకుండా తన ఆస్థులను అన్యాక్రాంతం చేయ రాదు. లేక తన ఖాపెట్టరాదు. (చట్టము 22/2001 ద్వారా ఈ సవరణ చేర్చబడింది).

## 5. సొసైటీ సభ్యత్వానికి అర్హతలు

ఆం. ప్ర. సహకార సంఘాల చట్టము 1964 సెక్షన్ 19 ప్రకారము మరియు ఆం. ప్ర. పరస్పర సహాయక సహకార సంఘముల చట్టము 1995 సెక్షన్ 19 ప్రకారం, సొసైటీలో సభ్యత్వము పొందుటకు కొన్ని అర్హతలు పెట్టబడ్డాయి.

**చట్టం 1964 సెక్షను 19 ప్రకారం :**

సొసైటీలలో సభ్యత్వానికి అర్హతలు, సెక్షను **21** లో పొందు పరచిన అనర్హతలకు లోబడి ఈ క్రింది విధంగా ఉంటాయి.

1. మైనారిటీ తీరిన, మంచి వ్యక్తిత్వం గల వ్యక్తులు సొసైటీలలో సభ్యత్వానికి అర్హులు. అదే సందర్భములో సదరు వ్యక్తులంతా ఒకే వర్గానికి చెంది ఉండవలెను. సొసైటి నిబంధనానుసారం ఏవర్గం కొరకు ఒక సొసైటి ఎర్పడిందో ఆ సొసైటీలు ఆ వర్గానికి చెందిన వ్యక్తులే సభ్యత్వానికి అర్హులు. సదరు సొసైటి నిబంధనావళిలో పొందు పరచబడిన, లేక సహకార ఉద్యమ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వము నిర్దేశించిన అర్హతలు కూడా వారికి ఉండవలెను.

**చట్టం - 1995 సెక్షన్ 19 ప్రకారము :**

నిబంధనావళి నిర్దేశించిన నిబంధనలు, షరతులకు లోబడి, ఒక సొసైటీ సభ్యత్వ బాధ్యతలను స్వీకరించుటకు ఇష్టపడి, సొసైటీ సేవలను వినియోగించుకొనదలచిన వ్యక్తి ఎవరైనా ఆ సొసైటీలో సభ్యత్వాన్ని పొందవచ్చును. అయితే అతనికి సేవలు అందించగల స్థితిలో ఆసొసైటి ఉండ వలెను. అంతే కాకుండా, అప్పటికే ఆవ్యక్తి ఆ సహకార సంఘమును పోలిన మరేదైనా సహకార సంఘములో ( ఆం. ప్ర. సహకార సంఘముల చట్టం **1964** క్రింద రిజిస్టరు కాబడిన) సభ్యుడై ఉండరాదు.

ఒక వ్యక్తికి సొసైటి సభ్యత్వము లభించినప్పటికీ, నిబంధనావళిలో పొందు పరచబడిన షరతులకు లోబడి మాత్రమే అతనికి సభ్యునిగా హక్కులు, ఓటు వేయు హక్కు ఉంటాయి.

అదే సందర్భములో ఒక వ్యక్తి సభ్యునిగా కనీసము సంవత్సర కాలం కొన సాగితేనే ఓటు వేయు అర్హత సంక్రమిస్తుంది.

## ౬. సొసైటీ సభ్యత్వానికి అనర్హతలు

సహకార సంఘముల చట్టము **1964** సెక్షను **21** ప్రకారము, ఈ క్రింది అనర్హతలు గల వ్యక్తి సొసైటీలో సభ్యత్వానికి అనర్హుడు, అలాగే సభ్యునిగా కొనసాగించుటకు అనర్హుడు.

i. దివాలా తీసినట్లుగా ప్రకటింప బడుట లేక డిశ్చార్జి కాబడిన ఇన్‌సాల్వెంట్ లేక

ii. సెక్షను 19 క్రింద సొసైటి సభ్యత్వానికి అనర్హత కలిగి ఉండుట లేక

iii. అనైతిక లేక నీతి బాహ్యమైన నేరము చేసినందుకు గాను శిక్షింపబడుట. అట్టి శిక్ష

అప్పీల్‌లో కూడ దృవీకరింపబడుట. అట్టి శిక్షా కాలము ముగిసిన మూడు సంవత్సరముల వరకు సభ్యత్వానికి అనర్హత ఉంటుంది లేక

iv. సొసైటిలో గాని లేక సొసైటి యొక్క ఫైనాన్సింగ్ బ్యాంకులో గానిలేక ఆ బ్యాంకు నుండి ఫైనాన్స్ పొందే ఏదైనా సొసైటీలోగాని వేతనముతో కూడిన ఉద్యోగము చేయుట లేక

v. ఈ చట్ట నిబంధనానుసారం సొసైటి నుండి బహిష్కరింప బడుట, బహిష్కరింప బడినప్పటి నుండి ఒక సంవత్సరము వరకు అనర్హత ఉంటుంది లేక

vi. సొసైటి లక్ష్యములకు విరుద్ధమైన వ్యాపారముగా ఫంక్షనల్ రిజిస్ట్రారుచే ప్రకటింప బడిన వ్యాపారమును కొనసాగించుట.

vii. సొసైటి నిబంధనలు నిర్దేశించిన విధముగా కనీస వ్యాపారము కూడ చేయలేక పోవుట లేక కనీస సేవలు సౌకర్యములను వినియోగించు కొన లేక పోవుట లేక

viii. ముందుగా అనుమతి పొందకుండ రెండు సంవత్సరముల వ్యవధిలో వరుసగా రెండు జనరల్ బాడీ సమావేశములకు గైరు హాజరగుట లేదా

ix. సొసైటి నిబంధనలు నిర్దేశించి నప్పటికీ, తనకు సంబంధించిన సమాచారమును వెల్లడి చేయక పోవుట.

x. అర్హత లేని వ్యక్తి సొసైటీలో సభ్యత్వము పొందినప్పుడు లేక అర్హత లేని వ్యక్తి అట్టి సభ్యత్వము కొనసాగు తున్నపుడు, సొసైటీ జనరల్ బాడీ తనకు తానుగా గాని ఆ సొసైటీ సభ్యులు కోరిన మేరకు గాని లేక ఫైనాన్సింగ్ బ్యాంక్ లేక ఫెడరల్ సొసైటి సూచన మెరకు గాని అట్టి వ్యక్తి సభ్యత్వాన్ని రద్దు చేయవచ్చును. దీనికి ముందుగా ఆ సభ్యునికి ఆ విషయము తెలియ పరచె అవకాశము ఇచ్చి రద్దు చేయవలసి ఉంటుంది. అట్టి తీర్మానము సభ్యునికి అందజేయ బడి నప్పటి నుండి అమలు చేయ బడినట్లు పరిగణింపబడును.

## 7. సహకార సంఘముల చట్టము 1964, రూలు 18 ప్రకారము సభ్యులు చేయ వలసిన కనీస వ్యాపారము, ఉపయోగించు కొనవలసిన కనీస సేవలు

ఒక సహకార సంవత్సరములో సొసైటీ నిబంధనావళి నిర్దేశించిన విధముగా ప్రతి సభ్యుడు కొంతకనీస వ్యాపారము చేయ వలయును లేక సొసైటీ సేవలను కనీస స్థాయిలో ఉపయోగించు కొనవలెను. అప్పుడే అట్టి సభ్యునికి సొసైటి పాలక వర్గమండలి ఎన్నికలలో పోటీ చేయుటకు ఎన్నికలలో ఓటు వేయుటకు అర్హత ఉంటుంది.

అంతే కాకుండ ఈ క్రింది సందర్భములలో మాత్రమే సొసైటీ సభ్యునికి ఓటు వేయు హక్కు ఉంటుంది.

a) కనీసం మూడు వందల రూపాయల షేర్ క్యాపిటల్ కలిగి ఉండాల (గొర్రెల పెంపకందారుల సహకార సంఘము బలహీన వర్గాలకు సంబంధించినది కాబట్టి కనీసషేర్ క్యాపిటల్ రూ 50/- మాత్రమే (Proceedings RC No. 13444/2001/L2 dated 04.08.2003 of CCR R.C.S.).

b) సంవత్సరములో కనీసం రూ. 200/- గాని లేక సొసైటీ నింబంధనావళి అంతకన్నా ఎక్కువ మొత్తము నిర్దేశించితే, ఆమొత్తమును గాని డిపాజిట్‌చేసి ఉండాలి (త్రిఫ్ట్ డిపాజిటు) (గొర్రెల పెంపకం దారుల సహకార సంఘమునకు త్రిఫ్ట్ డిపాజిట్ రూ. 50/- మాత్రమే) (Proceedings RC No. 13444/2001/L2 dated 04.08.2003 of CCR R.C.S.).

c) 12 మాసముల పాటు నిరంతరముగా సంఘ సభ్యునిగా కొనసాగాలి.

d) మూడు మాసములకు మించి సొసైటీకి చెల్లించ వలసిన సొమ్ము బకాయపడి ఉండరాదు.

## 8. సొసైటీ పాలక మండలి సభ్యులకు అనర్హతలు

ఈ క్రింది అనర్హతలు గల వ్యక్తులు సొసైటీ పాలక మండలి సభ్యులుగా ఎంపిక కాకూడదు, కొనసాగరాదు.

1. సొసైటి వేతనము తో పనిచేయు ఉద్యోగి గాని లేక సొసైటి యొక్క ఫైనాన్సింగ్ బ్యాంకులో వేతనముపై పనిచేయు ఉద్యోగి తో గాని అతి దగ్గర బంధుత్వమును కలిగి యుండుట.

2. సొసైటీకి గాని, మరేదైన సొసైటీకి గాని సొమ్మురూపములో గాని లేక వస్తు రూపములో గాని, నిబంధనలలో నిర్దేశించిన మూడు నెలల కాలమునకు గాని బకాయి పడిన

3. సొమ్ము బకాయికి సంబంధించి ఒక వ్యక్తికి వ్యతిరేకముగా ఏదైన డిక్రీ లేక తీర్పు, అవార్డులేక ఆర్డరు చేయబడి యుండి ఈ చట్టము క్రింద ఆవ్యక్తి నుండి సదరు సొమ్ము వసూలుకు సంబందించిన చర్యలు ఇంకా కొనసాగు తుండుట.

4. సొసైటీ తో ఒప్పందము కుదుర్చుకున్న ఏదైనా కాంట్రాక్టుతో సంబంధము కలిగి యుండుట.

5. సొసైటీ తరపున లేక సొసైటీకి వ్యతిరేకముగా న్యాయస్థానములలో వాదించువారు.

6. సొసైటీ చేయు వ్యాపారముపై ప్రభావము చూపునదిగా రిజిస్ట్రారు చే ప్రత్యేక లేక సాధారణ ఉత్తర్వు ద్వార ప్రకటించబడిన వ్యాపారము చేయుట.

7. గ్రామ పరిపాలనాధికారులు, రాష్ట్ర లేక కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు లేక రాష్ట్ర లేక కేంద్ర ప్రభుత్వ నిధుల నుండి సహాయము పొందుతున్న సంస్థలలోని ఉద్యోగులు లేక కేంద్ర / రాష్ట్ర ప్రభుత్వములకు చెందిన సంస్థల లోని ఉద్యోగులు.

8. అనైతిక చర్యలకు పాల్పడి నందుకు గాను క్రిమినల్ కోర్టు చేత శిక్షింప బడిన వారు. అయితే శిక్ష విధింప బడిన తేదీ నుండి **5** సంవత్సరముల వరకు మాత్రమే ఈ అనర్హత వర్తిస్తుంది.

9. ఇద్దరు కన్న ఎక్కువ మంది పిల్లలు గల వ్యక్తులు సొసైటి పాలక వర్గ సభ్యులుగా అనర్హులు. అయితే, ఆంధ్ర ప్రదేశ్ సహకార సంస్థల (సవరణ) చట్టము **1995** అమలు లోనికి వచ్చిన (ఈ సవరణ **2.1.1995** నుంచి వచ్చింది) ఒక సంవత్సరము లోపు జన్మించిన అదనపు సంతానమునకు ఈ సెక్షను వర్తించదు.

అదే విధముగా ఈ సవరణ చట్టము అమలు లోనికి వచ్చు సమయమునకే **(2.1.1995)** ఒక వ్యక్తికి ఇద్దరు కన్నా ఎక్కువ సంతానము ఉండి ఉండ వచ్చున (ఈ చట్టము అమలు లోనికి వచ్చిన ఒక సంవత్సరము లోపు జన్మించిన వారు మినహాయించి). సవరణ అమలు లోనికి వచ్చిన తర్వాత అతనికి అదనముగా పిల్లలు పుట్టనంత కాలం ఆవ్యక్తి సొసైటి పాలక మండలి సభ్యత్వానికి అర్హుడే. ఎవరైనా ఒక వ్యక్తికి ఈ సవరణలోని అనర్హతలు వర్తించకుండా మినహాయింపు ఇచ్చు అధికారము రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుంది. అయితే అందుకు గల కారణములను లిఖిత పూర్వకముగా పేర్కొన వలెను.

10. రాష్ట్ర శాసన సభ్యుడు, పార్లమెంటు ఉభయ సభల లోని ఏదైన సభ్యుడు, మున్సిపలు కార్పొరేషన్ మేయర్, మున్సిపల్ కౌన్సిల్ చైర్మన్, జిల్లా పరిషత్ అధ్యక్షుడు లేదా ఎన్నిక కాబడిన సభ్యుడు, మండల పరిషత్‌కు ఎన్నికైన సభ్యుడు లేదా అధ్యక్షుడు లేదా గ్రామ పంచాయత్ సర్పంచులు అనర్హులు.

11. ఒకే వ్యక్తి ఒకే సమయములో రెండు కన్నా ఎక్కువ ఎపెక్స్ సొసైటీ కమిటీలలో గాని లేక రెండు కన్నా ఎక్కువ కేంద్ర సొసైటీల కమిటీలలో గాని లేక ఒకటి కన్నా ఎక్కువ కేంద్ర సొసైటీ మరియు ఒకటి కన్నా ఎక్కువ ఎపెక్స్ సొసైటీల కమిటీలలో గాని సభ్యుడుగా కొనసాగరాదు.

## 9. కమిటీలో సభ్యత్వం రద్దు కావటం

1. సహకార సంఘముల చట్టము **1964** సెక్షన్ **21**AA ప్రకారము కమిటీలో పాలక వర్గ సభ్యుల సభ్యత్వము ఈ క్రింది సందర్భములలో రద్దు అవుతుంది. ఆవిధంగా పదవిని కోల్పోయిన వ్యక్తిని ఆతర్వాత మరొక రెండుటరముల వరకు కమిటీ సభ్యునిగా ఎన్నుకొన రాదు. లేక నియమించ బడరాదు.

   a) సొసైటీ ఆస్తిని తన స్వప్రయోజనాలకోసం వినియోగించుకొని నట్లుగా విచారణలో నిర్ధారణ అయినప్పుడు.

   b) సర్వీసు నిబంధనలకు విరుద్ధముగా సొసైటీలో ఉద్యోగ నియామకములు జరిగినట్లు నిర్ధారణ అయినప్పుడు

2. బుద్ధి పూర్వకముగా బినామీ పేర్లతో రుణములు ఇప్పించుటకు సొసైటీ కమిటీ సభ్యుడు బాధ్యుడైనట్లయితే అతని సభ్యత్వము రద్దవుతుంది. అంతే గాక, అప్పటి నుండి ఆరు సంవత్సరాల వరకు ఆ వ్యక్తి సొసైటీ కమిటీ సభ్యునిగా ఎన్నిక అగుటకు అనర్హుడు. అదే విధముగా సెక్షను **60** క్రింద సర్‌చార్జి ఆర్డరు జారీ కాబడిన వ్యక్తికి రుణము ఇచ్చుటకు బాధ్యుడైన సొసైటి కమిటి సభ్యునికి కూడా ఈ సెక్షన్‌లోని అనర్హత వర్తిస్తుంది.

3. వాటాధనాన్ని దుర్వినియోగం చేయుటంలేక స్వాహా చేసి నందు వలన ఏదైనా ఒక సహకార సంవత్సరములో సొసైటీకి నష్టం వాటిల్లి నట్లయితే, సదరు సొసైటీ యొక్క అధ్యక్ష కార్యదర్శులు తమ పదవులను కోల్పోతారు.

4. ఆడిట్ కొరకు నిర్దేశింపబడిన వ్యవధి లోపల ఒక సొసైటీ యొక్క వార్షిక జమా ఖర్చులను చీఫ్ ఆడిటర్‌కు పంపుట జరగనట్లయితే, అట్టి వ్యవధి ముగిసిన వెంటనే సదరు సొసైటి కమిటి సభ్యులు తమ పదవులను కోల్పోతారు.

5. విచారణ నివేదికను (సెక్షన్**51**) గాని లేక సెక్షన్**52, 53** లో నిర్దేశింప బడిన ఇన్‌స్పెక్షన్ నివేదికను గాని, లేక రిజిస్ట్రారు సూచనతో కూడిన ఆడిట్ రిపోర్టు లేక ప్రత్యేక రిపోర్ట్‌ను గాని, తమకు అందిన **30** రోజుల లోపల సర్వ సభ్య సమావేశములో ప్రవేశ పెట్టక పోయి నట్లయితే, అట్టి **30** రోజుల వ్యవధి ముగిసిన వెంటనే ఆ సొసైటి కమిటీ సభ్యులు తమ పదవులను కోల్పోతారు.

6. ఏదైనా సొసైటీలోని సభ్యులు లేక ఉద్యోగులు, ఈ చట్ట పరధిలోగాని లేక మరేదైన చట్టము క్రింది గాని నేరము చేసి ఉండవచ్చు. అటువంటి సభ్యులు లేక ఉద్యోగిపై ఫిర్యాదు

చేసితగు ప్రాసిక్యూషన్ చర్యలను చేపట్టుటలో సదరు సొసైటీ యొక్క కమిటీ సభ్యులు విఫలమయితే వారంతా తమ పదవులను కోల్పోతారు.

## 10. కమిటీ సమావేశములకు గైరు హాజరు అయినందువలన పదవిని కోల్పోవుట

సహకార సంఘముల చట్టము 1964 సెక్షను 21బి లో పొందు పరచబడిన నిబంధన ప్రకారము ఒక కమిటీ సభ్యుడెవరైన మూడు వరుస కమిటీ సమావేశములకు గైరు హాజరు అయినట్లైతే అతని సభ్యత్వము రద్దవుతుంది. అయితే అతని సభ్యత్వము ఈ చట్ట నిబంధనానుసారం పునరుద్ధరింప బడును. కానీ పదవీ కాలం మొత్తంలో ఒక్కసారి మాత్రమే ఆవిధంగా పునరుద్ధరణ సాధ్యం.

## 11. సొసైటీ సభ్యులను బహిష్కరించుట

1. సహకార సంఘముల చట్టము 1964 సెక్షన్ 23 ప్రకారము ఎవరైనా సభ్యుడు సొసైటీ ప్రయోజనములకు భంగము కలుగు రీతిలో వ్యవహరిస్తున్నట్లయితే, అతనిని సొసైటి బహిష్కరించ వలెను. బహిష్కరణకు చెందిన తీర్మానమును సర్వ సభ్యసమావేశము ఆమోదించ వలెను. మొత్తము సభ్యులలో నాలుగింట మూడు వంతుల మంది ఆతీర్మానమును ఆమోదించ వలెను.

2. బహిష్కరణకు ముందుగా సభ్యుని అభ్యంతరములను పరిగణలోకి తీసుకొన వలెను. సభ్యుడు తన అభ్యంతరములను సర్వ సభ్య సమావేశమునకు తెలుపుకొన వలెను. బహిష్కరణ తీర్మానమును సభ్యునికి అందజేయ వలయును.

## 12. ఓటు హక్కు దాని వినియోగము.

1. సహకార సంఘముల చట్టము 1964 సెక్షన్ 25 ప్రకారము ప్రతి సభ్యునికి ఒక ఓటు ఉంటుంది. ఆ ఓటు హక్కును సభ్యుడు స్వయముగా వినియోగించ వలసి ఉంటుంది.

   అదే సందర్భములో కొన్ని తరహాలకు చెందిన సొసైటీల విషయములో అట్టి సొసైటీలలో ఎవరైనా సభ్యుడు కనీసమైన వ్యాపారం కూడా చేయక పోవచ్చును. లేక సొసైటి అంద జేస్తున్న సేవలను ఏ మాత్రం వినియోగించక పోవచ్చును. అటువంటి సభ్యులకు సదరు సొసైటీ ఎన్నికలలో పోటీ చేయు హక్కుగాని, ఓటు వేయు హక్కుగాని ఉండదు.

   ఈ క్రింది సందర్భములలో మాత్రమే సొసైటీ సభ్యులకు ఓటు హక్కు ఉంటుంది.

a) నిర్దేశింప బడిన విధముగా కనిష్ట షేర్ కాపిటల్ కలిగి ఉండవలెను. (పైన 7వ పారాలో రూలు 18 వివరణ సందర్భములో చెప్పిన విధంగా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘ సభ్యులకు కనిష్ట షేరు క్యాపిటల్ రూ. 50/- మాత్రమే)

b) నిర్దేశింప బడిన విధముగా కనిష్ట మొత్తమును డిపాజిట్ చేసి ఉండవలెను. (7వ పారాలో చెప్పిన విధంగా త్రిఫ్ట్ డిపాజిటు రూ. 50/-)

c) కనీసము 12 నెలల పాటు సభ్యునిగా కొనసాగ వలెను.

d) నిర్దేశింప బడిన కాలములో సొసైటీకి ఏ విధముగాను బకాయి ఉండరాదు.

2. రెండు పక్షములకు సమానముగా ఓట్లు పడినప్పుడు సమావేశ అధ్యక్షుడు రెండవ ఓటును వినియోగించుకోవచ్చును లేదా కాస్టింగ్ ఓటు చేయవచ్చును.

## 13. జనరల్ బాడీ విధులు, బాధ్యతలు

సహకార సంఘముల చట్టము 1964 సెక్షన్ 30 నందు మరియు పరస్పర సహాయ సహకార సంఘముల చట్టము సెక్షన్ 20 నందు మహాజన సభ విధులు, బాధ్యతలు పొందు పరచ బడినవి. 1964 చట్టము క్రింద మరియు 1995 చట్టము క్రింద సొసైటీ యొక్క పాలనాధికారము అంతిమముగా జనరల్ బాడి చేతులలో ఉంటుంది. సభ్యుల సంఖ్య విపరీతముగా పెరిగి పోయి నప్పుడు మరింత సమర్థవంతముగా నిర్ణయాలు తీసుకోవాలంటే మినీజరల్ బాడీని (ప్రాతినిధ్య జనరల్ బాడీని) ఏర్పాటు చేసుకొనుటకు వీలుంది. 1964 చట్టము సెక్షన్ 30 (2) ననుసరించి ఈ క్రింది అంశములు జనరల్ బాడి పరిధి కిందకు వస్తాయి.

1. పాలక మండలి సభ్యులను ఎన్నుకొనుట, తొలగించుట, సొసైటీ సభ్యులను తొలగించుట.

2. రిజిస్ట్రార్‌కు వార్షిక నివేదికను పంపుట.

3. ఆడిట్ రిపోర్టును, వార్షిక సేవలను పరిశీలించుట.

4. నికర ఆదాయమును వినియోగించు విధానము.

5. సొసైటి నిబంధనావళి సవరించుట

6. సభ్యులను బహిష్కరించుట

7. ఆదాయ వ్యయములకు చెందిన వార్షిక బడ్జెట్‌ను ఆమోదించుట.

8. ఫైనాన్సింగ్ బ్యాంకు లేక ఇతర సొసైటీలకు తమ సొసైటీని అనుబంధముగా చేర్చుట.

9. ఫైనాన్సింగ్ బ్యాంకు లేక ఇతర సొసైటీలకు తమ సొసైటీ తరపున ప్రతినిధులను ఎంపిక చేయుట.

అధ్యక్షుని ఎన్నిక ప్రత్యక్ష ఎన్నిక ద్వారా జరిగినట్లయితే ఫైనాన్సింగ్ బ్యాంక్ లేక ఇతర సొసైటీలలో సదరు సొసైటీ ప్రతినిధిగా అధ్యక్షుడే వ్యవహరించ వలెను.

10. సొసైటీ పాలక మండలి సభ్యులు లేక వారి దగ్గర బంధువులకు ఇవ్వబడిన అడ్వాన్సులు, ఋణములను సమీక్షించుట, సొసైటీతో వారు నెరపిన వ్యాపారమును సమీక్షించుట, సొసైటీకి రావలసిన బకాయిలు ఉన్నట్లయితే అవిషయమును రిజిస్ట్రారుకు రిపోర్టు చేయుట.

11. సొసైటీ సభ్యులలో ఇద్దరిని (పాలక మండలి సభ్యులు కాని వారిని) సొసైటీ అంతర్గత ఆడిటర్లుగా నియమించుట.

12. అంతర్గత ఆడిటర్లు అంద జేసిన రిపోర్టును పరిశీలించుట

13. సహకార విద్యానిధికి కొంత మొత్తమును వితరణ చేయుట

14. సెక్షన్ 50 క్రింద స్పెషల్ ఆడిట్ రిపోర్టును, లేక సెక్షను 51 క్రింద పంపబడిన విచారణా నివేదికను, సెక్షన్ 52, 53 క్రింద పంప బడిన తనఖీ నివేదికపై సమీక్ష జరుపుట.

15. వసూలు చేయటం సాధ్యంకాని మొండి బాకీలకు సంబంధించిన నిర్ణయము తీసుకొనుట.

16. నిల్వల లోటును గాని లేక ద్రవ్య లోటునుగాని పరిష్కరించుట

17. పర్యవేక్షణ సంఘాలకు సభ్యులను ఎంపిక చేయుట, వాటికి బాధ్యతలను అప్పగించటం, వాటి రిపోర్టులను పరిశీలించుట.

18. సొసైటి ఆస్తులు, అప్పుల బదలాయింపు, సొసైటీ విభజన, లేక మరొక సొసైటీతో విలీనముపై నిర్ణయము తీసుకొనుట.

19. పాలక మండలి సభ్యులు విధులకు హాజరగు తీరును సమీక్షించుట.

20. సభ్యత్వమును సమీక్షించుట.

21. సభ్యుల అనర్హతలు, పాలక మండలి సభ్యుల అనర్హతలకు సంబంధించిన రిపోర్టుపై సమీక్ష జరుపుట.

22. అవధిని దాటిన ఋణముల గురించి (ఓవర్ డ్యూ) బకాయి దారుల గురించి సమీక్ష జరుపుట.

23. ఆపత్కాల నిధి, పాలనా వ్యవహారాల నిధిలో ఉన్నమొత్తమును దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల నియామకము, వారి వేతనములు, అలవెన్సుల గురించి తగు నిర్ణయములను తీసుకొని రిజిస్ట్రారు ఆమోదములను పొందుట.

## 14. సొసైటీ పాలక మండలి - ఎన్నికలు

**1964** చట్టములోని సెక్షన్ **31** ప్రకారము మరియు **1995** చట్టములోని సెక్షను **21** ప్రకారము సొసైటీ పాలక మండల ఏర్పాటు కావలయును. ఇందుకు సంబందించిన సహకార సంఘముల ఎన్నికల నిర్వహణ, **1964** చట్టము, రూలు **22** లేదా రూలు **22** బి మరియు **1995** చట్టములోని సెక్షన్ **23**లో పొందు పరచిన విధముగా ఎన్నికల నిర్వహణ ఏది వర్తిస్తే దాని ననుసరించి పాలక మండలి ఎన్నికలు నిర్వహించి సొసైటీ పాలక మండలిని ఏర్పాటు చేసుకొన వలయును.

## 15. పాలక మండలి అధికారములు, విధులు

**1964** చట్టములో సెక్షన్ **31**-ఎ లో మరియు **1995** చట్టము లోని సెక్షన్ **22** లో పొందు పరచబడిన విధముగా పాలక వర్గము తమ విధులను నిర్వర్తించ వలయును.

**1964** చట్టము సెక్షన్ **31**-ఎ లో సొసైటీ పాలక మండలి అధికారములు, విధులు ఈ క్రింది విధముగా ఉంటాయి.

1. సభ్యులను చేర్చుకొనుట గురించి జనరల్ బాడీకి సిఫార్సు చేయుట

2. సభ్యుల వాటా మూల ధనం గురించి, వాటా మూల ధనం బదలాయింపు గురించి జనరల్ బాడీకి సిఫార్సు చేయుట.

3. అనర్హతకు గురి అయిన సభ్యుల తొలగింపు గురించి జనరల్‌బాడీకి సిఫార్సు చేయుట.

4. అనర్హతకు గురి అయిన పాలక మండలి సభ్యుల తొలగింపు గురించి జనరల్ బాడీకి సిఫార్సు చేయుట, పాలక మండలి సభ్యత్వము కోల్పోయిన సభ్యుని తిరిగి పాలక మండలిలో చేర్చుకొనుటపై జనరల్ బాడీకి సిఫార్సు చేయుట. వివిధ రిపోర్టులను జనరల్ బాడీలో ప్రవేశ పెట్టుట.

5. ఋణములు, డిపాజిట్ల ద్వారా నిధుల సమీకరణ, వాటిని పెట్టుబడి పెట్టుట.

6. సొసైటీలో సభ్యత్వం పొందిన తేదీ ప్రాతిపదికగా ప్రధాన కార్యనిర్వహణ అధికారి యొక్క నిర్దిష్ట సిఫార్సు మేరకు సభ్యులకు ఋణములు, అడ్వాన్సులు ఇచ్చుటతో పాటు సభ్యులకు సేవలను అందించుట, ఋణ సౌకర్యములను కల్పించుట.

7. వార్షిక బడ్జెట్ కేటాయింపులు ఆధారంగా సొసైటీ కార్యకలాపములకు అవసరమైన నిధులను విడుదల చేయుట.

8. తమ పదవీ కాల పరిమితి ముగియక పూర్వము సొసైటీ నిబంధనావళి ననుసరించి నూతన పాలక మండలికి ఎన్నికలను జరిపించుట.

9. చట్టం నిబంధనానుసారం జనరల్ బాడీ సమావేశములను నిర్వహించుట.

10. నిర్దేశిత కాలపరిమితి లోపల జమాఖర్చులను ఆడిట్ చేయించుట. ఆడిట్ రిపోర్టును జనరల్ బాడీ సమావేశములో ప్రవేశ పెట్టుట.

11. సొసైటీ దైనందిక వ్యవహారములకు సంబంధించి తగు నిర్ణయములు తీసుకొనుట.

12. అడ్మినిస్ట్రేటివ్, ఆపత్కాల నిధి పరిస్థితిని బట్టి జనరల్ బాడి మరియు రిజిస్ట్రారు ఆమోదము తో సొసైటీ ఉద్యోగుల నియామకము, వారి జీత భత్యములను నిర్ధారించుట.

13. సెక్షన్ 51 పరిధిలోని విచారణ నివేదికలను 52, 53 పరిధిలోని ఇన్స్పెక్షన్ నివేదికలను, సెక్షన్ 50 పరిధిలో ఆడిట్ నివేదికలను నిర్దేశిత కాలపరిమితి లోపల జనరల్ బాడీ సమావేశములో ప్రవేశ పెట్టుట.

14. ఆడిట్ రిపోర్టులో మరియు 51, 52, 53 సెక్షన్ల పరిధిలోని నివేదికలలో ఎత్తి చూప బడిన పొరపాట్లను సరిదిద్దు కొనుట.

15. సెక్షన్ 59 క్రింద ఎవరైన సొసైటి అధికారి లేక ఉద్యోగిని సస్పెండ్ చేయుట.

16. ఈ చట్టము క్రింద గాని లేక మరేదైనా చట్టము క్రింద గాని క్రిమినల్ దుశ్చర్యకు పాల్పడిన వారిపై న్యాయ సంబంధిత క్రిమినల్ చర్యలను చేపట్టుట.

17. బకాయి దారుల జాబితాను తయారు చేసి బహిరంగముగా ప్రకటించుట ఆ వివరములను జనరల్ బాడికి తెలియ పరచుట.

18. ఇవ్వబడిన ఋణములపై ఎప్పటి కప్పుడు సమీక్ష జరుపుట, ఒవర్డ్యూ అయిన ఋణములు, అడ్వాన్సుల రికవరీకి తగు లీగల్ చర్యలు తీసుకొనుట.

19. సొసైటీ స్థితిగతుల గురించి పర్యవేక్షక సంఘానికి, రిజిస్ట్రారుకు, ఫైనాన్సింగ్ బ్యాంకుకు, ఫెడరల్ సొసైటీకి తగు సమాచారమును అందించుట.

20. పాలక మండలి సభ్యులకు వారి బంధువులకు ఇవ్వబడిన ఋణములు సొసైటీతో వారు జరిపిన వ్యాపారము, వారి లో బకాయి పడిన వారు ఎందరు, బకాయిలు రాబట్టుటకు వారిపై తీసుకొనబడిన చర్యల గురించిన రిపోర్టును జనరల్ బాడీకి పంపుట.

21. వార్షిక నివేదిక, వార్షిక ఆర్థిక నివేదిక, వార్షిక ప్రణాళిక, వార్షిక బడ్జెట్‌ను జనరల్ బాడీలో ప్రవేశ పెట్టుట.

22. సొసైటీ సభ్యులు, అధికారులు, ఉద్యోగులలో సహకార భావనను విద్యను పెంపొందించుట.

23. ఈ క్రింది అంశములకు సంబంధించిన సమాచారమును, రిపోర్టులు, స్టేటు మెంట్లను జనరల్ బాడీలో ప్రవేశ పెట్టుట.

i) ఆస్తుల విక్రయము

ii) ద్రవ్యలోటు, నిల్వలలో లోటు

iii) రిజర్వు ఫండు, ఇతర ఫండ్‌ల ఏర్పాటుతో పాటు నికర లాభమును వినియోగించుటపై రూపొందించిన పథకములు.

iv) నిరర్థక బాకీలను రద్దు చేయుట.

v) సభ్యత్వమును తొలగించుట

vi) సహకార విద్యానిధి, పరిపాలనా నిది ఆపత్కాల నిధులను, చెల్లించ వలసిన మొత్తము.

vii) సొసైటి ప్రయోజనములకు వ్యతిరేకముగా వ్యవహరించిన సభ్యుని సొసైటీ నుండి బహిష్కరించుట.

viii) ఫైనాన్సింగ్ బ్యాంకు మరియు ఇతర సొసైటీలకు తమ సొసైటీని అనుబంధము చేయుట

ix) ఫైనాన్సింగ్ బ్యాంక్ మరియు ఇతర సొసైటీలకు పంపు ప్రతినిధులను ఎన్నుకొనుట.

x) పర్యవేక్షక సంఘమును, సొసైటీ ఆడిటర్లను నియమించుట, వారి రిపోర్టులను పరిశీలించుట తదుపరి చర్యలను చేపట్టుట.

## 16. సొసైటి అధ్యక్ష మరియు పాలక మండలి సభ్యుల రాజీనామా

1964 చట్టము రూలు 23 ఎఎఎ ప్రకారము ఒక సొసైటీ నిబంధనావళిలో ఏమి పేర్కొన బడి ఉన్నది అన్నదానితో నిమిత్తము లేకుండా ఆ సొసైటి అధ్యకుడు తన రాజీనామ పత్రాన్ని స్వయమునగాని లేదా రిజిస్టరు పోస్టు ద్వారా గాని రిజిస్ట్రారుకు పంపుట ద్వారా తన పదవికి రాజీనామా చేయ వచ్చును. రిజిస్ట్రార్ ఆమోదించినప్పటి నుండి ఆరాజీనామా అమలు లోకి వస్తుంది. నిబంధనావళి ననుసరించి నూతన అధ్యకుని ఎన్నిక జరుగు వరకు అధ్యకుని అధికార విధులను ఉపాధ్యకుడు నిర్వహించ వలెను.

సొసైటి నిబంధనావళిలో ఏమి పేర్కొన బడనప్పటికి, ఎవరయినా పాలక మండలి సభ్యుడు లేక సభ్యులు తమ రాజీనామా పత్రములను రిజిస్టర్డ్ పోస్టు ద్వారా గాని లేక స్వయముగా గాని సొసైటీ ప్రధాన పాలనాధికారి లేక అధ్యకునికి పంపుట ద్వారా తమ పదవులకు రాజీనామా చేయ వచ్చును. పాలక మండలి ఆమోదించి నప్పటి నుండి వారి రాజీనామాలు అమలు లోకి వస్తాయి.

మూడు నెలలకు మించి అధ్యకుడు విధులకు గైరు హాజరు అయినప్పుడు లేక అధ్యకుడు మరణించి నప్పుడు, నిబంధనావళి ననుసరించి నూతన అధ్యకుని ఎన్నిక జరుగు వరకు అధ్యకుని అధికార విధులను ఉపాధ్యకుడు నిర్వర్తించ వలెను.

మొత్తం పాలక మండలి లేక పాలక మండలి సభ్యులలో మెజారిటీ సభ్యులు రాజీనామా చేసిన సందర్భములలో క్రొత్త పాలక మండలికి ఎన్నికలను సహకార సంఘము రిజిస్ట్రారు నిర్వహిస్తారు. క్రొత్త పాలక మండలి అధికార బాధ్యతలను చేపట్టు వరకు పాత పాలక మండలినే కొనసాగ వలసిందిగా రిజిస్ట్రార్ ఆదేశించ వచ్చును లేక మరెవరినైనా ఇన్‌చార్జిగా నియమించ వచ్చును.

## 17. పాలక మండలి సమావేశ నోటీసులను జారీ చేయు విధానము

1964వ చట్టము రూలు 23 బి ప్రకారము పాలక మండలి సమావేశములకు సంబంధించిన నోటీసులను సభ్యులందరికీ సొసైటీ ప్రధాన పాలనాధికారి గానిలేక ఉన్న ఉద్యోగులలో సీనియారిటీ ఉన్న ఉద్యోగి గాని, ఉద్యోగులెవరు లేనట్లయితే ఉపాధ్యకుడు గాని లేక సొసైటీ నిబంధనావళి ప్రకారం అధికారం గల వ్యక్తిగాని స్వయముగా అందజేయ వలయును, లేక తిరుగు రశీదు తో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వార పంప వలెను.

## 18. జనరల్ బాడీ సమావేశములు పాలక మండలి సమావేశములు

**1964** చట్టములోని సెక్షన్ **32(1)** మరియు **1995** చట్టములోని సెక్షన్ **24** ప్రకారము ఆయా సంఘముల జనరల్ బాడీ సమావేశములు, పాలక మండలి సమావేశములు జరుప బడ వలయును.

**1964** చట్టము సెక్షన్ **32 (1)** ప్రకారము ప్రతిసంవత్సరము లోనూ రెండు కన్నా తక్కువ కాకుండ జనల్‌బాడీ సమావేశములను పాలక మండలి ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ప్రతి ఆరు నెలలకు ఒక జనరల్ బాడీ సమావేశము జరిగి అందులో మొదటి అర్థ సంవత్సరములో ఒక సమావేశము జరుప వలయును. ఈ నిబంధన ప్రకారము జనరల్ బాడీ సమావేశమును పాలక మండలి ఏర్పాటు చేయ నట్లయితే, ఆ జనరల్ బాడీ సమావేశము జరుగ వలసిన కాలవ్యవధి ముగిసిన మరుక్షణమే సదరు పాలక మండలి రద్దయినట్లుగా పరిగణింప బడుతుంది.

పాలక మండలి సమావేశములను ఏర్పాటు చేయుట అధ్యక్షుని బాధ్యత. ఆ క్రమంలో ప్రతి మూడు మాసములకు ఒక సమావేశము జరుప బడవలయును. తన బాధ్యతను నిర్వహించుటలో అధ్యక్షుడు విఫలమైనందు వలన ఏదైన మూడు మాసముల వ్యవధిలో గాని లేక ఆపై మరొక మాసములో గాని పాలక మండలి సమావేశము జరుగకపోవచ్చును. అటువంటి సందర్భములో అదనపు మాసము ముగిసిన వెంటనే అధ్యక్షుడు తన పదవిని కోల్పోతాడు.

## 19. జనరల్ బాడీ సమావేశములకు, పాలక మండలి సమావేశములకు కోరం

**1964** చట్టము రూలు **23** ప్రకారము సొసైటీ సర్వ సభ్య సమావేశమునకు కావలసిన కోరం ఆయా సొసైటీల నిబంధనావళి ననుసరించి, మొత్తం సభ్యులలో కనీసం **1/5** వంతు హాజరయితేనే కోరం ఉన్నట్లుగా పరిగణింప బడుతుంది.

పాలక మండలి సమావేశములకు సంబంధించి మొత్తం సభ్యులతో మెజారటీ సభ్యులు హాజరయితేనే కోరం ఉన్నట్లుగా పరిగణింప బడుతుంది.

## 20. పర్సన్ - ఇన్ - చార్జి కమిటీ నియామకము

**1964** చట్టము సెక్షను **32 (7) (ఎ)** ప్రకారము కొన్ని సొసైటీలకు పాలక మండలి ఉండని పరిస్థితి కలుగ వచ్చును లేదా సర్వసభ్య సమావేశమును ఏర్పాటు చేసి ఎన్నిక ద్వారా పాలక మండలి ఏర్పాటు సాధ్యం కాదని రిజిస్ట్రారు లేక ప్రభుత్వం భావించవచ్చు. అటువంటి

సందర్భములలో కొన్ని నిర్దిష్ట తరహా పాలనా బాధ్యతలు నిర్వహించుటకై ఒకరినిగాని లేక కొందరిని గాని పర్సన్ - ఇన్ - చార్జ్ / కమిటినిగాని రిజిస్ట్రారు నియమించవచ్చు. ఆరు మాసములకు మించకుండా వారు అట్టి సొసైటీ బాధ్యతలను నిర్వహించవచ్చు. ప్రభుత్వం తనకు తానుగా గాని లేక ప్రభుత్వ అనుమతితో రిజిస్ట్రార్ గాని సదరు ఆరుమాసముల కాలవ్యవధిని పెంచ వచ్చు. అయితే మొత్తంమీద అయిదు సంవత్సరములకు మించి పొడిగించరాదు.

పై విధముగా నియమింప బడిన వ్యక్తి లేక వ్యక్తులు సందర్భానుసారంగా ప్రభుత్వం లేదా రిజిస్ట్రారుల పర్యవేక్షణకు లోబడి ఎప్పటి కప్పుడు వారి సూచనలు, ఆదేశములకు అనుగుణముగా వ్యవహరిస్తూ సొసైటీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాలకమండలకి గల అన్ని లేక కొన్ని అధికార విధులను నిర్వహించవలెను.

ఇట్లు నియమించ బడిన వ్యక్తి లేక వ్యక్తుల నియామకము కాలం ముగిసిన వెంటనేగాని లేక ఈ లోపుగాని క్రొత్త పాలక వర్గము ఎన్నుకొను నిమిత్తము సర్వ సభ్య సమావేశము రిజిస్ట్రారు ఏర్పాటు చే య వలయును. క్రొత్త పాలక మండలి పదవీ బాధ్యతలను చేపట్టుటలో సదరు వ్యక్తి లేక వ్యక్తులు తమ అధికారమును కోల్పోతారు.

## 21. అధ్యక్షుని అధికారములు, ఉపాధ్యక్షునికి సంక్రమించు సందర్భములు

**1964** చట్టము సెక్షను **32**- బి ప్రకారము, పాలక మండలి సమావేశము నిర్దిష్ట సమయంలో జరుపని సందర్భములలో అధ్యకుడు తన పదవిని కోల్పోవటం జరుగ వచ్చు లేక సొసైటీ కేంద్ర కార్యాలయం ఉన్న చోట **15** రోజుల కన్నా ఎక్కువ రోజులు వరుసగా అధ్యకుడు ఉండకపోవచ్చు అటువంటి సందర్భములలో అధ్యకుని అధికారములు, విధులు ఉపాధ్యకునికి సంక్రమిస్తాయి.

## 22. అధ్యక్షులు, పాలక మండలి, మ్యానేజింగ్ డైరెక్టరు మరియు సిబ్బంది పరస్పర, అవగాహన, సత్సంబంధములు, సమన్వయము

ఆంధ్ర ప్రదేశ్ సహకార సంఘముల చట్టము **1964** మరియు ఆంధ్ర ప్రదేశ్ పరస్పర సహాయక సహకార సంఘముల చట్టము **1995**లో పొందు పరచ బడిన విధంగా అధ్యక్షులు, పాలకవర్గము, మహాజన సభ, ముఖ్య కార్య నిర్వహణాధికారి / మానేజింగ్ డైరెక్టరు మరియు సిబ్బంది ఎవరికి వారు నిర్వర్తించ వలసిన విధులు, బాధ్యతులు, జవాబు దారీ తనము చట్టములలో, నిబంధనలలో, నిబంధనావళిలో స్పష్టముగా తెలియ పరచి నప్పుడు, ఎటువంటి

అవోహలకు తావివ్వకుండా ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వహించి నప్పుడే సంఘవ్యవహారములు నిరాటంకంగా సాగుతాయి లేదా సొసైటీ మనుగడే ప్రమాదం సంభవించుటయే గాక ఆయావ్యక్తులు చట్టవ్యతిరేక చర్యలకు శిక్షార్హులగుదురు.

## 23. అధ్యక్షులు, పాలక మండలి సభ్యులు చేయ వలసిన, చేయకూడని పనులు

(Do's and Dont's)

a) చేయ వలసినవి (Do's) :

1. పాలక మండలి సభ్యులు క్రమం తప్పకుండా పాలక వర్గ సమావేశములు మరియు మహాజన సభలకు హాజరయి అందులో చురుకుగా పాల్గొని, సహకార స్ఫూర్తి తో మెలిగి ఇతరులకు మార్గదర్శులు కావలయును.

2. పాలక మండలి సభ్యులు, పాలక వర్గసమావేశముల మరియు మహ జన సభ అజెండా నోట్సును క్షుణ్ణముగా చదివి, పరిశీలనా దృష్టితో అవగాహనా దృష్టితో పరీక్షించి అవసరమైన వివరములను ముఖ్యకార్యనిర్వహణాధికారి ద్వారా పొంది సభలకు హజరయి నిర్మాణత్మక సలహాలను ఇచ్చి క్రియా శీలకముగా విధులను నిర్వర్తించ వలయును.

3. పాలక మండలి సభ్యులు సంఘము నిబంధనావళిని, నిబంధనలను, మరియు చట్టముతో పొందు పరచ బడిన విషయములపై మంచి అవగాహన కలిగి ఇతరులతో చర్చించి లేదా, సందేహాలను తీర్చుకొని సరియైన నిర్ణయములను, తీర్మానముల ద్వార సమావేశము తో చేయవలయును.

4. పాలక మండల సభ్యులు సమావేశ అజండా నోట్సును ముందుగానే కార్యనిర్వహణా ధికారి ధ్వారా పొంది, క్షుణ్ణముగా పరిశీలంచి కావలసిన అదనపు సమాచారము, వివరములను పొంది సమావేశమునకు హాజరు కావలెను.

5. పాలక మండలి సభ్యులు గతంలో తీసుకున్న తీర్మానాలపై, కార్యనిర్వహణాధికారి తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకొని అవసరమైనచో ముందు చర్యలను సూచించి "పాలోఅప్" చేయవలయును.

6. పాలక మండలి సభ్యులు ఫంక్షనల్ రిజిస్ట్రార్ నుంచి గాని, పశు సంవర్ధక శాఖ నుంచి, లేద ప్రభుత్వము నుంచి గాని వచ్చిన ఆదేశములను, ఆర్డర్లను ఎప్పటికప్పుడు సమావేశములో తెలుసుకొని, చర్చించి, అందులోని చర్యలను అనుసరించవలెను.

7. బైలాలో, నిబంధనలలో పాలక మండలకి అప్పచెప్పిన విధులను తూ.చ తప్పకుండా పాటించి, అందుకు తీసుకొవలసిన చర్యలను చెపట్టవలయును.

8. అధ్యక్షులు, పాలక వర్గసభ్యులు, ముఖ్యకార్య నిర్వాహణధికారితొ మరియు సంఘసిబ్బందితో సత్సంబంధములు కలిగి, పరస్పర అవగాహనతో, సమన్వయముతో మెలిగి సంఘ అభివృద్ధికి, కార్య చరణకు తోడ్పడవలయును.

B) చేయకూడని పనులు (Dont's)

1. అధ్యక్షులుగాని, పాలకవర్గ సభ్యులుగాని తమ పరిధీలో లేని, విధులలో పొందుపరచని విషయములలో తలదూర్చకుండా, మహాజన సభ, పాలక వర్గము సమూహముగా నిర్వర్తించ వలసిన విషయములు, ముఖ్య కార్యనిర్వహణాధికారికి నిబంధనావళిలో, చట్టములో అప్పచెప్పిన విధులు ఆయాసంబంధిత వ్యక్తులకు వ్యవస్థలకు వదిలి, తమ విధినిర్వహణకే పరిమితమై సంఘవ్యవహారములు సాఫీగా సాగుటకు, నిర్మాణాత్మకముగా పనిచేయవలయను.

2. ఏ పాలక వర్గ సభ్యుడైనా సంఘ సిబ్బందిలో ఎవరికైనా డైరెక్టుగా ఆదేశాలు ఇవ్వడంగాని, స్వంత విషయములు అప్పగించడం గాని చేయకుండా ఆఫీస్ డెకోరము పాటించి ముఖ్యకార్య నిర్వహణాధికారి ద్వార అఫిషియల్ ఇనఫర్మేషన్ పొందవచ్చును. అప్పుడే ఆఫీసు డిసిప్లెను కాపాడుటకు వీలు కలిగి, జవాబు దారి తనము ముఖ్య కార్యనిర్వహణాధికారి ద్వార పొందవచ్చును.

3. పాలక వర్గ సభ్యులలో ఎవ్వరైనా సిబ్బంది వ్యవహారములో అప్పాయింట్‌మెంటు, ట్రాన్స్‌ఫర్, పోస్టింగ్, ప్రొమోషన్, గ్రివెన్సెస్ లకు సంబంధించి తలదూర్చకుండా దూరముగా ఉండాలి.

4. పాలక మండలి సభ్యులు ఎవరు సొసైటీ, దిన చర్యలలో, కార్యలయ పనులలో తల దూర్చకుండా ముఖ్యకార్య నిర్వహణాధికారి ద్వార కావలసిన సమాచారము పొంద వచ్చును.

5. అప్పుశాంక్షన్, సేవలు అందించటంలో అందరు సభ్యులను సమానముగా వ్యవహరించి, కొందరి విషయంలో అత్యుత్సాహము చూపక, పక్షపాతముగా వ్యవహరించరాదు.

6. ప్రత్యక్షముగా గాని పరోక్షముగా గాని ఏదైన కార్యవర్గ సభ్యునికి సంబందించిన

విషయము సమావేశములో ప్రస్తావనకు వచ్చినప్పుడు సదరు వ్యక్తి అట్టి సమావేశములో పాల్గొనకూడదు.

7. పాలక వర్గ సమావేశములో చర్చకు వచ్చిన విషయములు సంఘశ్రేయస్సుకు భంగము కలిగే పక్షంలో బయట ఎక్కడా పొక్కనీయకూడదు.

8. సంఘ సిబ్బందిలో ఎవరైన తన స్వంతపనులకో, స్వలాభాములకొ, ఒత్తిడి చేయుటకు ప్రయత్నించి నప్పుడు, అట్టి వ్యక్తిని గట్టిగా అభిశంసించవలెను.

9. సమావేశములకు సంబంధించిన ఏ కాగితమునైనా, మీటింగ్ తర్వాత ఆఫీస్ లోనే అప్పగించి, సంఘము సమాచారము, సంఘమునకే వ్యతిరేకముగా మరేవరి చేతనైనా ఉపయోగ పడకుండా తగు జాగ్రత్తలు తీసుకొన వలయును.

10. పాలక వర్గ సభ్యులెవరు అప్పు శాంక్షనుకు ఏ వ్యక్తికైనా రికమెండ్ చేయటంగాని, సొసైటీ బిల్డింగ్ మరియు స్థలములకై సిఫారసు చేయటంగాని, కాంట్రాక్టర్స్, లాయర్స్ విషయంలో సిపారసు గాని, జోక్యంగాని వ్యక్తిగతంగా చేయకుండా అట్టి నిర్ణయాదికారము ఎవరికి ఉందో వారికే వదలివేయాలి.

11. సొసైటీ ధనముగాని, ఆస్తులుగానితమ పరిధిలో ఉన్నప్పుడు వాటిని దుర్వినియోగము, స్వంతమునకు వాడరాదు.

## 24. పాలక మండలిని బర్తరఫ్ చేయుట

ఏదైనా ఒక సొసైటీ పాలక మండలి సరిగా వ్యవహరించటం లేదని గాని, లేక చట్ట నిబంధనానుసారం తాను జారీ చేసిన ఉత్తర్వులేక ఆదేశములను సదరు సొసైటీ బుద్ధి పూర్వకముగా అమలు చేయలేదనిగాని రిజిస్ట్రారు భావించినట్లయితే సదరు సొసైటీ పాలక మండలిని రిజిస్ట్రారు బర్తరఫ్ చేయవచ్చును. అయితే ఆవిధముగా బర్తరఫ్ చేయుటకు ముందు ఆవిషయమును సదరు సొసైటీ పాలక మండలికి తెలియ పరిచివారి అభ్యంతరములను పరిగణలోకి తీసుకొన వలయును. ఆ సొసైటీ పాలనా వ్యవహారముల నిర్వహణకై ఒక ప్రత్యేక అధికారిని కాని (స్పెషల్ ఆఫీసర్) లేక ఇద్దరు లేక అంతకన్న ఎక్కువ మందితో కూడిన మ్యానేజింగ్ కమిటిని గాని నియమించవచ్చును. సదరు ప్రత్యేక అధికారి లేక మ్యానేజింగ్ కమిటి కాల పరిమితి రెండు సంవత్సరములకు మించరాదు. అయితే అవసరమును బట్టి ఆకాలపరిమితిని రిజిస్ట్రార్ మరొక సంవత్సరము వరకు మాత్రము పొడిగించవచ్చును.

ప్రత్యేక అధికారి లేక పాలక మంజలి కాలపరిమితి పూర్తి అగుసమయమునకు సొసైటీకి క్రొత్త పాలక మండలి ఎన్నుకోను నిమిత్తము జనరల్ బాడీ సమావేశమును రిజిస్ట్రారు ఏర్పాటు చేయవలయును.

## 25. సొసైటీ నిర్వహించ వలసిన రిజిష్టర్లు. అక్కౌంటు పుస్తకములు

**1964** చట్టము రూలు **59**లో నిర్దేశించిన ప్రకారము ఈ క్రింది రిజిష్టర్లు, అక్కౌంటు పుస్తకములు మెంటైన్ చేయవలయును.

1. జనరల్ బాడి మరియు పాలకమండలి సమావేశముల వివరములను రికార్డుచేయు "మినట్స్‌బుక్"
2. సభ్యులుగా చేరిన వ్యక్తుల వివరములు రికార్డు చేయు "అడ్మీషన్ బుక్" సభ్యులపేర్లు, చిరునామా, సభ్యునిగా చేరినతేదీ, అతను తీసుకున్న షేర్లు, వాటిపై చెల్లించిన మొత్తము, తదితర వివరములన్నీ అడ్మీషన్ బుక్‌లో ఉండవలయును.
3. రోజవారి జమ, చెల్లింపులు, నికర బ్యాలెన్స్‌ను తెలుపు "క్యాష్ బుక్"
4. సొసైటీకి చేయబడిన చెల్లింపులకు సంబంధించిన "రశీదు పుస్తకము", పుస్తకములోని రశీదులు డూప్లికేట్‌లో ఉండవలెను.
5. సభ్యులకు ఇచ్చిన ఋణములకు సంబంధించి ఋణముల రిజిస్టర్ ఉండవలెను. ఋణము ఇచ్చినతేది, ఇవ్వబడిన ఋణము, ఎందునిమిత్తము ఋణము ఇవ్వబడినది, తిరిగి చెల్లించ వలసిన తేది, అసలు వడ్డీ విడి విడిగా చూపవలెను, మొదలగు వివరములు ఋణముల రిజిస్ట్రర్‌లో ఉండవలెను.
6. డిపాజిట్లు ఇతర విధములుగా చేసిన అప్పుల వివరములను "లెడ్జర్ ఆఫ్ బారోయింగ్స్" లో రికార్డు చేయవలయును.
7. సభ్యులు సొసైటీకి గల బకాయిలను లయబిలిటి రిజిస్టర్‌హొందపరచవలయును. సభ్యుడు తాను స్వయముగా తీసుకున్న ఋణము ద్వారా గాని లేక ఇతురులు తీసుకున్న ఋణములకు హామీగా ఉన్నందువలనగాని సొసైటీకి చెల్లించ వలసిన వివరములు ఆరిజస్టర్‌లో ఉండవలెను.
8. నెలమొత్తములో జరిగిన చెల్లింపులు, జమలకు సంబంధించి "నెలసరి రిజస్టరు", ఉండవలయును.

**26. సొసైటీ చిరునామా మరియు సైను బోర్డు (1964 చట్టము సెక్షన్ 118 ప్రకారము)**

ఉత్తర, ప్రత్యుత్తరములు జరుపు నిమిత్తం ప్రతి సొసైటీకీ ఒక చిరునామా ఉంటుంది. చట్ట నిబంధనానుసారం ఆ చిరునామా కూడా రిజిస్టర్ ఉంటుంది. ఆ చిరునామా మారినట్లయితే, చిరునామా మారిన 30 రోజుల లోపల ఆవిషయమును రిజిస్ట్రారుకు తెలియ పరచవలసి ఉంటుంది.

సొసైటీ పేరును తెలిపే ఒకసైన్ బోర్డును ప్రతి సొసైటీ కార్యాలయము వెలుపల, ఆ సొసైటి బ్రాంచి కార్యాలయం వెలుపల ప్రదర్శించాలి.

**27. బైలాలు, వార్షిక జమా ఖర్చులు, లాభనష్టాల పట్టిక మొదలైనవి సభ్యులకు అందుబాటులో ఉండవలెను.**

1964వ చట్టము సెక్షన్ 119 ప్రకారము ప్రతిసహకార సంఘము చట్టము యొక్క ప్రతిని, చట్ట నిబంధనల ప్రతిని, ఆసొసైటీ నిబంధనావళిని, ఆఖరి సారిగా ఆడిట్ చేయబడిన వార్షిక జమా ఖర్చుల పట్టికను, సభ్యుల జాబితాను, పాలక మండలి సభ్యుల పేర్లను సభ్యులందరికి అందు బాటులో ఉంచవలెను. సొసైటీ పని వేళలలో సభ్యులు ఎవరైనా, ఎటువంటి రుసుము చెల్లించ కుండా వాటిని పరిశీలించు కోవచ్చును. అంతే కాకుండా ప్రతి సభ్యుడు తన వ్యాపార లావా దేవీలకు సంబంధించిన వివరములను సంబంధిత పుస్తకములలో చూసి తెలుసు కొనుటకు అవకాశము ఉండవలెను.

**28. సొసైటీ సమావేశములకు ఎవరు అధ్యక్షత వహించ వలెను.**

1964 చట్టము రూలు 26 ప్రకారం సొసైటీ జనరల్ బాడీ సమావేశములకు పాలక మండలి సమావేశములకు కూడా సొసైటీ అధ్యక్షు డే అధ్యక్షత వహించ వలెను. అధ్యక్షుడు గైరు హాజరు ఐనప్పుడు ఉపాధ్యక్షుడు అధ్యక్షత వహించవలెను. వారు ఉభయులూ లేనప్పుడు పాలక మండలి సభ్యులే తమలో ఒకరిని ఎన్నుకొనవచ్చును. అతని అధ్యక్షతన సమావేశం జరుప వలెను.

అయితే, సమావేశములో చర్చించ వలసిన అంశముల లో ప్రత్యక్ష ప్రమేయం కలిగిన వ్యక్తిమాత్రము సదరు సమావేశములకు అధ్యక్షత వహించరాదు, ఆవ్యక్తి అధ్యక్షుడు కావచ్చు, ఉపాధ్యక్షుడు కావచ్చు, లేక పాలక మండలి సభ్యుడుకావచ్చు.

## ౨౯. సహకార సంఘముల పారితోషకము (ఆనరోరియం)

1964 చట్టము రూలు 35-A ప్రకారము సొసైటీల వర్గీకరణ ననుసరించి వాటి పారితోషకమును రిజస్ట్రారు నిర్ధారిస్తారు.

(జి.ఓ.యమ్.స్. నెం. 154, ఎఫ్ & ఏ (కోఆప. III) తేది. 11.3.1977)

## ౩౦. సొసైటీ కార్యలయ ఆవరణను ఇతర కలాపములకు ఉపయోగించ రాదు.

1964వ చట్టము రూలు 62 ప్రకారము ఫంక్షన్ రిజిస్ట్రారు యొక్క నిర్ధిష్ట అనుమతి లేనిదే సొసైటీ ప్రాంగణమును పూర్తిగా గాని లేక పాక్షికముగా గాని సొసైటీ కార్యకలాపములకు తప్ప మరొక్క విధముగా వినియోగించరాదు ఆవిధముగా వినియోగించుటకు ఇతరులకు అనుమతి ఇవ్వరాదు.

అదేవిధముగా రిజిస్ట్రార్ అనుమతి లేనిదే సొసైటి ప్రాంగణము లో ప్రైవేటు వర్తకు లెవరు సొసైటీ వ్యాపారమును పోలిన వ్యాపారము చేయరాదు.